# రాజమాత

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

మహాభారత సంగ్రామం సమాప్తమై పోయిన పిమ్మట ౧౫ సంవత్సరాల పర్యంతము గాంధారీ ధృతరాష్ట్రు లిద్దరు ధర్మరాజసన్నిధినే ఉండిపోయారు. ధర్మరాజు అంధదంపతు లిద్దరికీ ఏవిధమైనలోపము రానీయకుండా క్షణక్షణము కంటికి రెప్పలా కాపాడుతూండేవాడు. అంతే గాక అనుక్షణము వారి కనుసన్నలలోనే మెలగుతూ కుమారులు లేకపోయారే అనే భావముకూడా వారిమనస్సులలో పొడచూప నీయలేదు. ధృతరాష్ట్ర మహీపతి అభ్యనుజ్ఞ లేనిదే తానై స్వయంగా ఏ రాజ్యకార్యము నిర్వహించలేదు. సామ్రాజ్యాధికారభారం ధర్మరాజు భుజస్కంధాలపైనే నిలిచినా హస్తినాపుర పౌరజానపదులందరు ధృతరాష్ట్రుడే రాజ్యరక్షణ భారం వహిస్తున్నాడని భావించేవారట! ఆ ౧౫ సంవత్సరాలు ధర్మరాజు విధంగా మసలుకుంటూ అనేకవిధాలుగా గాంధారీధృతరాష్ట్రుల మన్ననలకు పాత్రుడైనాడు. ఇక కుంతీదేవి, ద్రౌపదీదేవి మొదలయినవా స్త్రీజనంకూడా గాంధారీ ధృతరాష్ట్రుల కిద్దరికీ రాత్రింబగళ్ళు ఏమరకుండా పరిచర్యలు చేస్తూ వేయివిధాలుగా వారిని కనిపెట్టిచూచారు.

మిగిలిన పాండవులందరు ధర్మరాజు అభీష్టప్రకారమే ప్రవర్తిస్తూ గాంధారీ ధృతరాష్ట్రుల మనస్సు నొవ్వకుండా వారియెడల భయభక్తులతో మెలుగుతూ ఉండేవారు. అయితే ఈ విషయంలో భీమసేనుని పంథా మాత్రం బాగా మారిపోయింది.

అతడు ధృతరాష్ట్రునికి వినబడీ వినబడనట్లుగా దూరదూరంగా నిలబడి సూటీపోటీ మాటలెన్నో విసురుతూండేవాడు. ఒకనాడు 'ఆహా ఈ భుజద్వయంవల్ల కదా! దుర్యోధనాదిదుష్టులందరు నిర్నామధామమైయారు!' అని తన భుజబలాని కెంతైనా మురిసిపోయాడు! ఈ మాటలు కర్ణాకర్ణిగా ధృతరాష్ట్రుని చెవులో పడ్డాయి. ఇంకా ఇలాంటివే ఎన్నెన్నో సూటీపోటీమాటలు అంధనృపతి దాకా వెళ్ళిపోయాయి. పాపం ధృతరాష్ట్రుడా ఎత్తిపొడుపు మాటలు భరించలేక లోలోపల ఎంతైనా కుమిలి కృశించిపోయేవాడు.

ఒకనా డతనికి హస్తినాపురం విడిచి వనవాసానికి వెళ్లిపోవాలనీ ఇక ఆయుశ్శేషం అంతా అరణ్యవాసంలోనే గడపివెయ్యాలనీ సంకల్పం కలిగింది.

పిమ్మట ఒకనాడు ధర్మజునికి తన సంకల్పం తెలియజేశాడు. ధర్మరాజెంత మాత్రము దాని కంగీకరించలేదు. కాని అటు పిమ్మట కొంత కాలానికి హస్తినాపురం సందర్శించిన వ్యాసమహర్షి గాంధారి ధృతరాష్ట్రుల కిక అరణ్యవాసమే సముచిత ధర్మమని ఆదేశించాడు. వ్యాసమహర్షి ఆదేశించినపిమ్మట ధర్మరాజుకు కూడా వారి వనవాసాని కంగీకరింప తప్పలేదు.

అనంతరం ధృతరాష్ట్రునికి యుద్ధంలో మృతులయిన భారతవీరులందరికీ తిరిగీ ఒకసారి యథావిధిగా పైతృక కర్మ లాచరించి అటుపిమ్మట గాంధారిదేవితో కలసి వనవాసానికి వెళ్లిపోవాలనే సంకల్పం కలిగింది. వెంటనే విదురునికి తన సంకల్పం తెలియజేశాడు. విదురుడు ధర్మరాజసన్నిధికి వెళ్ళి అయనకు ధృతరాష్ట్రుని సంకల్పం ఎరుకపరిచాడు. ధర్మరాజు సంకల్పాని కెంతో ఆనందించాడు. ధృతరాష్ట్రునికి పైతృక కర్మలకు కావలిసినంత సువర్ణము పుష్కలంగా ఇవ్వవలెననీ ఆయన చేత ఎన్నెన్నో దానధర్మాలు చేయించవలెననీ అనుకొన్నాడు.

కాని భీమసేనుడు దాని కంగీకరించలేదు. దుర్యోధనాదులు చేసిన దుష్కృత్యాలన్నీ తలుచుకోగానే అతని హృదయం అంతా ఒక్కసారిగా దహించుకుపోయింది! ధృతరాష్ట్రుని కా విధంగా సువర్ణం అర్పింపరాదని నిష్కర్షగా చెప్పివేశాడు!

అర్జును డాతనిమాటల కీ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"భీమా! వృద్ధనరపతి భీష్మాది కురువీరులందరికీ పరలోకక్రియ లాచరింపవలెనని సంకల్పించాడు. పృథివి కంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన చక్రవర్తి ఆత్మబంధువులకు పితృకర్మలు చెయ్య సంకల్పించి మనలను సువర్ణం యాచిస్తున్నాడు. పూర్వం ఒకప్పు డాయన్ని మనం అయిదు ఊళ్లైనా ఇవ్వవలసిందని యాచించాము. అలాంటి ఏకచ్ఛత్రాధిపతే మనల నిప్పుడు కేవలం పితృకర్మల కోసం సువర్ణం కావలెనని యాచిస్తున్నాడు! ఆహా! ఎంతటి కాలవిపర్యయం సంప్రాప్తమైంది! అందువల్ల ఇంత స్వల్పవిషయం కాదని తిరస్కరించడం ధర్మం కాదు! దీనికి నీ వంగీకరించవలెను!"

అయినా భీమసేనుని హృదయం కరగలేదు!

భీష్మద్రోణాదులైన బంధువర్గానికి తామే పితృకర్మలాచరించవచ్చుననీ ఇక మిగిలిన దుర్యోధనాదులెవరికీ పితృకర్మ లాచరింపరాదనీ వారంతా అధోలోకాలలో పడి మ్రగ్గిపోవాలనీ చెప్పి తన లోపలి ఆక్రోసమంతా వెళ్లగక్కాడు! అంతటితో ఊరుకోక దుర్యోధనాదులు తమయెడల నెరపిన దుశ్చేష్టితాలన్నీ వరసగా ఏకరువు పెట్టాడు.

అనంతరం అర్జునుడతనికి అనేకవిధాలుగా చెప్పి చూచాడు. అయినా భీమసేనుడు దాని కంగీకరించలేదు.

అప్పుడు ధర్మరాజిక ఏమిచెయ్యడానికీ పాలుపోక స్వయంగా స్వీయకోశాగారంలోనించి ధృతరాష్ట్రునికి ధనం సమర్పింపగలననీ భీమసేనుడన్న మాటలకు కినియవద్దని ధృతరాష్ట్రునికి సందేశం పంపించాడు.

విదురుడా సందేశం యథాతథంగా ధృతరాష్ట్రునికి తెలియజేశాడు. ధర్మరాజార్జును

అన్నివిధాలా అతని సంకల్పం నెరవేర్చగల మని అన్నారనీ, భీముడుమాత్రం మొట్టమొదట దాని కెంతమాత్రము అంగీకరించలేదనీ అయితే అన్నగారావిధంగా ప్రత్యుత్తరం ఇచ్చిన తరవాత ఒక్క నిట్టూర్పు విడిచి తన అర్ధాంగీకారంమాత్రం తెలియజేశాడనీ విన్నవించాడు. భీమసేనుని మాటల కన్యథా భావించవలదని ధర్మపుత్రుడు ప్రత్యేకంగా పంపించిన విజ్ఞప్తికూడా అతనికి తెలియజేశాడు.

ధృతరాష్ట్రుడటుపిమ్మట ధర్మరాజు సమర్పించిన పుష్కల సువర్ణ ధనరాసులతో భీష్మద్రోణాది బంధుజనుల కందరికీ యథావిధిగా పైతృకకర్మ లాచరించి మరునాటి ప్రభాతవేళ అరణ్య వాసానికి ప్రయాణ మైనాడు.

## ౨

ధృతరాష్ట్రనృపతి వల్కలాజినాలు ధరించి గాంధారీదేవితో కలిసి అరణ్యవాసానికి బయలుదేరి పోతున్నాడనే వార్త నాలుగు వైపులా వ్యాపించగానే హస్తినానగరం అంతటా ఒక మహాకోలాహలం బయలుదేరింది. పౌరులందరు అశ్రుపూరిత నేత్రాలతో హస్తినాపుర రాజవీధులలో నిలబడి, అరణ్యవాసానికి తరలిపోతున్న వృద్ధ ధృతరాష్ట్ర చక్రవర్తి వైపు రెప్పపాటు లేకుండా తిలకించారు. ధృతరాష్ట్రుడు దోసిలి ఒగ్గి నెమ్మది నెమ్మదిగా సాగిపోతూ తాను, తన కుమారులు చేసిన అపరాధాలన్నీ మన్నించవలసినదని పౌరజానపదులందరినీ సవినయంగా అభ్యర్థించాడు. చక్రవర్తి అభ్యర్థన వినగానే పౌరజానపదులనేకులు పెద్దపెట్టున విలపించారు.

ధృతరాష్ట్రుని అరణ్యవాస యాత్రలో రాజమాత కుంతీదేవి ముమ్ముందుగా సాగిపోయింది. ఆమెభుజం అవలంబనంగా గ్రహించిన గాంధారిదేవి, ఆమెభుజం అవలంబనంగా గ్రహించిన ధృతరాష్ట్రుడు కుంతీదేవి అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నెమ్మదిగా సాగిపోయారు. వారి వెంట పాండవులు, ద్రౌపది, సుభద్ర, ఉత్తర మొదలయిన రాజకాంతలంతా నడిచి వెళ్ళారు. ధృతరాష్ట్రచక్రవర్తి అరణ్యవాసయాత్రవేళ అంతవరకు ఎండ కన్నెరగని మహిళలెందరో అశ్రుపూరిత నేత్రాలతో రాజవీథులలో పాదచారిణులై సాగిపోయారు.

క్రమక్రమంగా వారందరు హస్తినాపుర వర్ధమాన ద్వారందాటి వెళ్ళిపోయారు. ధృతరాష్ట్రుడు పౌరజానపదుల నందరినీ తిరిగి స్వగృహాలకు మరలిపోవలసిందని ప్రార్థించాడు. క్రమక్రమంగా పౌరులందరు స్వభవనాలకు మరలిపోయారు. అయితే సంజయుడు, విదురుడు కూడా ధృతరాష్ట్రునితో బాటే వనవాసానికి తరలిపోయారు.

కాని కుంతీదేవి మాత్రం ఆ అంధ వృద్ధ దంపతులిద్దరికి మార్గం చూపిస్తూ ముమ్ముందుగా అలాగే సాగిపోయింది.

ధర్మపుత్రుని కా క్షణంలోనే ఆమె వారితో కలిసి అలాగే వనవాసానికి సాగిపోగలదేమో అన్న అనుమానం పట్టుకుని వేధించసాగింది.

కుంతీదేవి అంతకుపూర్వం ఎన్నడు అరణ్యవాసానికి బయలుదేరిపోయే సంకల్పమైనా వ్యక్తం చేసి ఉండలేదే! ద్రౌపదీదేవి మొదలయిన వధూజనంతోనైనా ఆవిషయం ముచ్చటించి ఉండలేదే! అయినా ఆమె కా సమయంలో హఠాత్సంకల్పమైనా కలిగిందా? అని ధర్మరాజ నేకవిధాలుగా మథన పడినాడు.

ఇలాంటి అనుమానం మిగిలిన పాండవులకుగాని ద్రౌపదిదేవి, సుభద్ర మొదలయిన అంతఃపురస్త్రీలకుగాని అణువంతైనా కలగలేదు.!

రాజమాత కుంతీదేవి ఒకమారైనా వెనుకకు తిరిగిచూడకుండా అలాగే ముందుకుసాగిపోతున్నది. ధృతరాష్ట్రాదులంతా అప్పటికే హస్తినాపురందాటి కొంత దూరం సాగిపోయారు. ధృతరాష్ట్రుని ప్రయాణవేళ మహారాజప్రాసాదాలలో మ్రోగించిన ప్రయాణభేరీధ్వను లింకా మంద్రమంద్రంగా మారుమోగుతూనే ఉన్నాయి! ప్రాతఃకాలప్రయాణవేళ ధౌమ్యాదిపురోహితులు పఠిస్తున్న స్వస్తిమంత్రాలు తూర్యధ్వనులలో స్పష్టాస్పష్టంగా స్ఫురించాయి. బాలభానుకిరణాలు వారి మార్గంలో సువర్ణాక్షతలవలె తళతళ మెరిశాయి. అప్పుడే మేలుకొన్న పక్షుల కలకలారావాలు వారందరికీ ఉపచారవాక్యాలవలె వినిపించాయి.

వారందరు ఇంకా చాలా దూరం సాగిపోయినా కుంతీదేవి ఆ వృద్ధదంపతులకు దారి చూపిస్తూ గంభీరంగా అలాగే సాగిపోయింది. ధర్మపుత్రునికి ఆమె మరి వెనుకకు మరలి వచ్చే సూచనలే స్ఫురించలేదు.

## 3

నెమ్మదిగా ఆమెను సమీపించి దోసిలి ఒగ్గి నిలబడి — "అమ్మా! నేను మహారాజును అనుసరించి చాలాదూరంవరకు వస్తున్నాను. నీవు పరిజనంతో కలిసి వెనుకకు మరలిపోవలసింది." అని ప్రార్థించాడు.

దానికి కుంతీదేవి ఏమీ మారుపలకలేదు. ఆమె నేత్రాలనుండి కన్నీరు అవిరళధారగా ప్రవహించింది. ఆమె ఇంకా కొంతదూరం వరకు అలాగే సాగిపోయింది. ధర్మరాజు తిరిగి సవినయంగా ఆమెను సమీపించి తన ప్రార్థన మన్నించవలసిందని బ్రతిమాలుకొన్నాడు.

దానితో ఆమె ఒక నిమిషం నిలబడింది. ఆమె భుజం ఆనుకొని నడక సాగిస్తున్న గాంధారి, గాంధారి భుజం ఆనుకొని యాత్ర సాగిస్తున్న ధృతరాష్ట్రుడు కూడా నిలబడిపోయారు. కుంతీదేవి గద్గదస్వరంతో నెమ్మదిగా సమాధానం చెప్పింది.

"నాయనా! సహదేవుని మనస్సెన్నడు నొప్పించవద్దు! అతడు నన్నెన్నడు వదిలి ఉండలేదు. ఇక నీవే అతని కేడుగడ!

ధర్మరాజా! నాహృదయం వజ్రనిర్మితం! కనకనే కర్ణకుమారుణ్ణి ఆవిధంగా నేలపాలు చేసుకొన్నాను! అతనినిగూర్చి ఇంకా ఎన్నెన్నో మహాదానా లర్పించవలసినది.

ధర్మపుత్రా! ద్రౌపదీదేవికి అభీష్టమైన మార్గంలోనే నడుచుకో! భీమార్జునాదుల నందరినీ ఇకనించి నీచేతిలోఅప్పగిస్తున్నాను.

ఈపైన ఈ అత్తమామ లిద్దరికీ పరిచర్య చేసుకుంటూ నేనుకూడా వారితోబాటే వనవాసం చెయ్యాలని సంకల్పించాను!"

అని చెప్పి మరి మారుమాటలేకుండా మళ్ళి వెనక్కైనా తిరిగి చూడకుండా కుంతీదేవి అలాగే నడిచిపోయింది.

ఈ ప్రత్యుత్తరం వినగానే ధర్మరాజు హృదయానికి వజ్రాఘాతం తగిలింది. అతని ముఖం వెలవెలబోయింది. ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి తిరిగి కుంతీదేవి కిలాగ విజ్ఞప్తి చేసుకొన్నాడు:

"అమ్మా! నీవిలా గనడం ధర్మంకాదు! వనవాసానికి నే ననుమతించేది లేదు! నీవ నేకవిధాలుగా మాలో ఉత్సాహశౌర్యా లుద్రేకింపజేసి సంగ్రామరంగానికి పురిగొల్పావు. నేను నీ ప్రోత్సాహం వల్ల శత్రువులందరినీ నిశ్శేషంగా సంహరించివేసి భూమండలానికి కంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యంవహించి అకలంక మైన క్షాత్రధర్మం పరిపాలిస్తున్నాను. ఈ సమయంలో నీవు మమ్మల్ని విడిచి వెళ్ళడం న్యాయ్యంకాదు. అమ్మా! కొడుకులతోను కోడళ్లతోను కలకలాడే రాజ్యం విడిచిపెట్టి వెళ్ళిపోవడానికి నీకు మనస్సెలా ఒప్పింది? నివు నిర్జనమైన అరణ్యంలో నివసింపలేవు! మామీద కనికరించు తల్లీ!"

ఒక్కనిమిషం నేపామె ధర్మరాజన్నమాటలన్నీ శ్రద్ధగా ఆలకించింది. తిరిగీ ఆమె నేత్రాలనుంచి ఉవ్వెత్తుగా బాష్పధారలు ప్రవహించాయి. అంతేగాని ధర్మరాజడిగిన ప్రార్థనకామె సమాధాన మేమీ చెప్పలేదు. జలజలరాలే బాష్పధారలతో అలాగే నడిచిపోయింది.

అటుపిమ్మట ఆమెతో ఆ విషయంప్రసంగించడానికి ధర్మజునికి మరి సాహసం

# ★ రాజమాత ★

కలగలేదు. అయినా ఆమె వెనువెంటనే ఇంకా కొంతదూరంవరకు అలాగే సాగిపోయాడు.

ధర్మరాజు పార్శ్వభాగంలో నడుస్తున్న భీమసేను డీ ప్రసంగంఅంతా శ్రద్ధగా అలకిస్తూనే ఉన్నాడు. అతనితో కలిసి వెంట వెంటనే నడిచివస్తున్న మిగిలిన అర్జున నకుల సహదేవాదులందరు ఆప్రసంగం విన్నారు. అన్నగారే మరి మాటలాడడానికి సాహసించలేదన్న విషయం వారొకరికంట కనిపెట్టి చూచారు. అందువల్లనే వారుకూడా ఇక మాటలాడడానికి సాహసించలేకపోయారు. భీమసేనునికి వారందరి మౌనం పీన్యము దుస్సహమైపోయింది. అదీగాక కుంతీదేవి వృద్ధులను అత్తమామలవడం కూడా అతనికి నచ్చలేదు! అతడు కొంత తొందరగా కుంతీదేవి పార్శ్వానికి నడిచి వెళ్ళిపోయాడు. ఆమె అతన్ని చూచీ చూడనట్టుగానే సాగిపోయింది. గాంధారి ధృతరాష్ట్రులకు మార్గంలో ఏ విధమైన తొట్రుపాటు సంభవించకుండా అత్యంత భద్రంగా వారిద్దనీ వెనువెంట తోడ్కొనిపోయింది.

భీమసేనుడామె పక్కగానే అడుగులు వేసుకుంటూ కొంచెం ఉద్రృతస్వరంతో ఇల్లాగన్నాడు:

“మహారాజ్ఞీ! నీవీ సామ్రాజ్య వైభవం అంతా అనుభవించవలసిన శుభ సమయ మిది! ఈ సమయంలో ఇలాగ అరణ్యాలకు వెళ్ళిపోవడం ఏమీ సముచితంగా లేదు! చేజేతులా నీవే మా అందరిచేత జననాశనం చేయించావు! అలాంటిదానవిప్పు డిలాగ అరణ్యవాసానికి బయలుదేరిపోవడానికి కారణం నాకవగతం కావడం లేదు! నీవీవిధంగా అరణ్యవాసం చెయ్యడం న్యాయంకాదు! సుఖంగా యుధిష్ఠిరుని సామ్రాజ్యవైభవం అనుభవిస్తూ హస్తినాపురంలో ఉండవలసిందని ప్రార్థిస్తున్నాను. మహారాజ్ఞీ! దయతో నా ప్రార్థనమన్నించవలసిందని కోరుతున్నాను.” భీమసేనాదుల వెనువెంట ద్రౌపదీదేవి మొదలయిన అంతఃపురమహిళలుకూడా నడుస్తూనే ఉన్నారు. భీమసేను డీ విధంగా ప్రసంగించిన తరవాతనైనా వారికి మాటలాడడానికి సాహసం కలగలేదు. అలాగే కొంతదూరంవరకు నిశ్శబ్దంగా ఆమె వెనువెంటనే నడిచివెళ్లారు. వారి ముఖాలన్నీ విషాదంతో వివర్ణములైపోయాయి.

కుంతీదేవి మొదట కొంతసేపటివరకు భీమసేనునికి ప్రత్యుత్తరం చెప్పలేదు. వారందరి ముఖాలు కన్నీటిధారలతో తడిసిపోయిన విషయం ఆమె గ్రహించకపోలేదు.

అయినా సంతతంగా ప్రవహిస్తున్న కన్నీటిధారలతో అలాగే నడిచిపోతూ చీరచెరగుతో ఒకేఒక్కసారి కన్నీరు తుడుచుకొని, ఒక నిమిషం ఆగి, ఎంతో ఆప్యాయంగా భీమసేనునివైపు జూచి నెమ్మదిగా ఇలాగన్నది:

“నాయనా! మీరందరు దుర్ద్యూతంలో పరాజితులై పరాభవఖిన్నులై నిస్తేజస్కులైపోయినారు. ఆ సమయంలో పాండుమహారాజ సంతతి నిర్వీర్యమైపోయిందే అనే విషాదంతోనే మీలో క్షాత్రధర్మం ఉత్తేజింపజేశాను. వెయ్యి ఏనుగులతో సమాన బలశాలివైన నీవు దైన్యంతో కుంగిపోతున్నావనే భయంతోనే నీలో పౌరుషాగ్ని ప్రజ్వలింపజేశాను! ధర్మసంరక్షకుడుగా నిలవబడవలసిన ధర్మజునికి వనవాస దుర్గతిపట్టకుండా అతని నీ యుద్ధోద్యోగానికి పురికొల్పాను. విజయునికి పరాజయం అనుచితమనే దృష్టితోనే అతని నీ విధంగా సముద్ధరించాను. ఇక నకుల సహదేవుల మాట వేరే చెప్పనే అక్కరలేదు గదా!

ద్రౌపదీదేవిని ఆనాడు నిండు పేరోలగంలో ఒక క్రీతదాసిగా అవమానించినప్పుడే నాకీ పాండవకులం నశించిపోగలదనే భయం కలిగింది. ఆ క్షణనించీ నీలో క్షాత్రవదుస్సహమైన శౌర్యాగ్ని జ్వాల ప్రజ్వలింపజేశాను! ఆ విధంగా మిమ్మల్ని అందరినీ సముద్ధరించడానికి గల కారణం ఇంతే!

అంతేగాని సామ్రాజ్యభోగా లనుభవించడం కోసమే నే నిదంతా చేసిఉండలేదు సుమా! పాండుమహారాజు జీవితకాలంలోనే నేను సమస్త సామ్రాజ్యభోగాలు అనుభవించాను! నాకు వాటితోనే సంపూర్ణ సంతృప్తి కలిగింది.

ఆయనలేని నాకీ సామ్రాజ్యభోగాలేల నాయనా!

తపస్సుచేసి భర్తృలోకం చేరుకోడానికే నే నరణ్యానికి వెళ్ళిపోతున్నాను.

వృద్ధులైన గాంధారీ ధృతరాష్ట్రులే నాకిక అత్తమామలు! వారిద్దరి శుశ్రూషతోనే నా శరీరం శుష్కింపజేయవలెనని సంకల్పించాను.”

అని చెప్పి ఆమె యుధిష్ఠిరునివైపు చూచి ఇంకా ప్రశాంతస్వరంతో ఇలాగ చెప్పింది.

“నాయనా! ధర్మరాజా! నీవు మాతో చాలా దూరం వచ్చావు. ఇక నీవు భీమసేనాదులతోను, కోడళ్లతోను కలిసి వెంటనే హస్తినాపురానికి మరలిపో!

ధర్మదేవత నీహృదయంలో సుప్రతిష్ఠితమై ప్రకాశించుగాక!”

అని చెప్పి మళ్ళీ తిరిగిచూడకుండా, ఆమె అలాగే నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయింది.

కుంతీదేవి ప్రత్యుత్తరంతో భీమసేనునితోబాటు మిగిలినవా రందరు తలలు వంచేసుకున్నారు. ఆ పిమ్మట వారెవ్వరు దించిన తలలిక ఎత్తనేలేదు.

అటుపిమ్మట అందరు నిశ్శబ్దంగా గాంధారీధృతరాష్ట్రులకు, కుంతీదేవికి ప్రదక్షిణనమస్కారా లాచరించి సన్నసన్నని రోదనధ్వనులతో హస్తినాపురానికి తరలిపోయారు. కాని కనిపించినంతవరకు వారి చూపులన్నీ కుంతీదేవివైపే ప్రసరించాయి.

అయితే మహారాజమాత కుంతీదేవి మరి వెనకకు దృష్టి మరల్పకుండా గాంధారీధృతరాష్ట్రుల నిద్దరినీ అదేవిధంగా తన వెనువెంటనే నడిపించుకుపోయింది.

పాండవులందరు గోవులేని గోవత్సాలవలె విషణ్ణవదనాలతో నిట్టూర్పులు విడుస్తూ నెమ్మది నెమ్మదిగా హస్తినాపురం చేరుకొన్నారు. ★

---

“అమ్మా” అని ఏడుస్తూ పరిగెత్తుకొచ్చాడు. ఎనిమిదేళ్ల అబ్బాయి.

“ఏం నాన్నా? ఎందుకు?” అంది తల్లి.

“నాన్నెమో గోడకి మేకు కొడుతూ, వేలు చితకొట్టుకున్నాడు.”

“నాన్న వేలికి చిన్న దెబ్బ తగిల్తే ఏడుస్తావుట్రా, పకపక నవ్వాలిగాని!” అంది అమ్మ నవ్వుతూ.

“ముందర ఏడవ లేదమ్మా... ముందర నవ్వేను...అందుకే” అన్నాడు చిట్టిబాబు.